
www.vishalabharati.com
epaper:vishalabharati.com

విశాల భారతి
vishalabharathi Telugu Daily
శనివారం, 04.11.2023 హైదరాబాద్
1pm edition


# పొలిట్రిక్స్ 2023-2024

పొలిట్రిక్స్



# నేడు కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి బ్రేక్

- కోనాయపల్లిలో నామినేషన్ పేపర్లకు పూజలు
- ఈ నెల 9న గజ్వేల్,కామారెడ్డిలో నామినేషన్లు

**విశాల భారతి, హైదరాబాద్:**

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ శనివారం ఎన్నికల ప్రచారానికి విరామం ఇచ్చారు. ఆయన ఇవాళ సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని కొనాయపల్లిలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. కేసీఆర్ కు ఈ ఆలయం అంటే సెంటిమెంట్.. ఇప్పటికే సీఎం తన ఫ్యామిలీతో కలిసి రాజశ్యామల యాగం పూర్తి చేశారు. అయితే, ఈ నెల 9న కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇక శుక్రవారం నుంచి తెలంగాణలో నామినేషన్ల ప్రక్రియ స్టార్ట్ అయింది. ఎమ్మెల్యేలుగా పోటీ చేయాలని భావించిన అభ్యర్థులు ఎన్నికల అధికారుల దగ్గర నామినేషన్ పత్రాలను సమర్పించాలి. అయితే, బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ తో పాటు కామారెడ్డిలో కూడా పోటీ చేస్తున్నారు. ఒకే రోజు 9న రెండు నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అందుకే కొనాయపల్లి లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసేందుకు వెళ్తున్నారు. ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగాన్ని పూర్తి చేశారు. మరోవైపు, కేసీఆర్ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో గులబీ బాస్ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీంతో ఈ ఎన్నికలు ముగిసే వరకు సీఎం కేసీఆర్ షెడ్యూల్ బిజీబిజీగా ఉంటుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని కవర్ చేసేలా బీఆర్ఎస్ నేతలు ప్రణాళికలు రెడీ చేశారు.

# 'హస్తం' గూటికి విజయ శాంతి!

– నేడు బీజేపీకి రాజీనామా చేసే అవకాశం..?
– నేడో, రేపో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని టాక్..

**విశాల భారతి, హైదరాబాద్:**



బీజేపీ సీనియర్ నాయకురాలు, సినీ నటి విజయశాంతి పార్టీ మారనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తిరిగి కాంగ్రెస్ గూటికి ఆమె చేరనున్నారనే వార్తలొస్తున్నాయి. గత ఎన్నికలకు ముందు రాములమ్మ కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో అనిశ్చితి నెలకొనడం, నేతలందరూ పార్టీని వీడుతుండటంతో విజయశాంతి కూడా హస్తం పార్టీని వీడి బీజేపీలో చేరారు. అయితే బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటేననే ప్రచారం ఊపందుకోవడం, కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ వీక్ కావడంతో చాలామంది నేతలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు.

ఈ క్రమంలో మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి రెండు రోజుల కింద రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. బీజేపీలో ఉన్న విజయశాంతి కూడా నేడో , రేపో హస్తం గూటికి చేరడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా విజయశాంతి బీజేపీకి దూరంగా ఉంటున్నారు. ఆ పార్టీకి అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో కూడా ఆ పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా పాల్గొనడం లేదు. ఇప్పటికే ఆమెతో కాంగ్రెస్ నేతలు చర్చలు కూడా జరిపారని, పార్టీ మారడం ఖాయమనే టాక్ నడుస్తోంది. ఈ క్రమంలో పార్టీ మార్పు వార్తలపై విజయశాంతి ఇటీవల ట్విట్టర్‌లో ఆసక్తికర కామెంట్స్‌చేశారు. సినిమాల్లో మాదిరిగా రాజకీయాల్లో ద్విపాత్రాభినయం సాధ్యపడదని, ఒక పార్టీకే పనిచేయగలుగుతానని అన్నారు. కాంగ్రెస్‌లో చేరి కేసీఆర్‌పై పోరాడాలని కొందరు సూచిస్తున్నారని, మరి కొందరు బీజేపీలోనే ఉండాలని చెబుతారని తెలిపారు. అయితే సినిమాలో మాదిరిగా రాజకీయాల్లో డ్యూయల్‌రోల్‌పోషించే అవకాశం ఉండదని చెప్పుకొచ్చారు. త్వరలోనే నిర్ణయం ఉంటుందని చెప్పకనే చెప్పారు.

# ఎన్నికలకు 375 కంపెనీల కేంద్ర బలగాలు




**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు కోసం కేంద్ర ఎన్నికల సంఘం 375 కంపెనీల సాయుధ కేంద్ర బలగాలను కేటాయించిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి బీఆర్కే భవన్‌లోని ఎన్నికల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ''అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.453 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువులను స్వాధీనం చేసుకున్నాం'' అని వికాస్‌రాజ్ తెలిపారు. ''ఆదివారం మినహా ఈనెల 10 వరకు నామినేషన్లు అన్ని నియోజకవర్గాల్లో స్వీకరిస్తాం. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3,21,88,753కు చేరింది (సర్వీసు ఓటర్లు మినహా). 1819 సంవత్సరాల వయసు వారు 9,10,810 మందికి ఓటు హక్కు వచ్చింది. ఇంత పెద్ద సంఖ్యలో తొలి ఓటర్లు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు సీవిజిల్ ద్వారా 2,487, నేషనల్ గ్రీవియన్ రెడ్రెసల్ వ్యవస్థ ద్వారా 18వేల ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై 362 ఫిర్యాదులు వచ్చాయి. 256 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. కాంగ్రెస్‌పై 16, భారాసపై 13, భాజపాపై అయిదు, బీఎస్పీపై మూడు కేసులు నమోదుచేశారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలైన 13 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహిస్తాం. మిగిలిన 106 నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

# తెలంగాణ బీజేపీలో జనసేన కుంపటి!



## సీట్ల సర్దుబాటులో కమలం పార్టీలో లుకలుకలు
## పొత్తుల ఎత్తులపై ఇంకా పార్టీల్లో రాని స్పష్టత
## సస్పెన్స్‌పై అభ్యర్థుల్లో పెరుగుతున్న నైరాశ్యం
## జనసేన వద్దు బీజేపీ ముద్దు' అంటున్న క్యాడర్
## స్టేట్ ఆఫీస్ వద్ద బీజేపీ జిల్లాల లీడర్ల నిరసనలు

**విశాల భారతి, హైదరాబాద్:**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇంకా పార్టీల మధ్య పొత్తుల సయోధ్య కొలిక్కి రావడం లేదు. ఒక వైపు ఇంతకాలం కాంగ్రెస్‌తో పొత్తుకు ఆసక్తి చూపిన కమ్యూనిస్టులు బ్రేకప్ చెప్పేశారు. కానీ జనసేన బీజేపీ పొత్తు అంశం తెలంగాణలో మరింత హీట్‌ను పుట్టిస్తోంది. నాగర్ కర్నూల్ టికెట్ జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం నేపథ్యంలో హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌నిరసనలతో హోరెత్తింది. తన అనుచరులతో కలిసి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి దిలీపాచారి నిరసనకు దిగారు. ' 'జనసేన వద్దు.. బీజేపీ ముద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జనసేన అసలు తెలంగాణలోనే లేదని అలాంటప్పుడు టికెట్ ఎలా కేటాయిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జనసేనతో పొత్తు పై లుకలుకలు**

బీజేపీ ఎట్టకేలకు మూడో విడత కూడా గురువారం ప్రకటించింది. ఇప్పటి వరకు 88 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఇంకా 31 స్థానాలు పెండింగ్‌లో పెట్టింది. అయితే బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఆ 31 నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించకుండా కమలం అధిష్టానం పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో పలు సెగ్మెంట్లలో బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆ పార్టీలో లుకలుకలు వెలుగుచూస్తున్నాయి.

**మిగిలిన 31 సీట్ల కోసం జన సేన పట్టు..**

అయితే పొత్తుల్లో భాగంగా జనసేనకు 8నుంచి 10 సీట్లు కేటాయించేందుకు కమలం ఒకే చెప్పినట్లు తెలిసింది. ఖమ్మం, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆ పార్టీకి టికెట్లు కేటాయిస్తామని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ పార్టీకి శేరిలింగపల్లి, కూకట్‌పల్లి, ఖమ్మం, వైరా, అశ్వరావుపేట, కోదాడ, నాగర్ కర్నూల్, తాండూరు టికెట్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన సీట్లలో మెజారిటీ సీట్లు తమకు కేటాయించాలని జనసేన నేతలు పట్టు బడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలోనే 32 మంది అభ్యర్థులతో జనసేన తొలి జాబితాను ప్రకటించింది. బీజేపీతో పొత్తు అంశం తెరపైకి రాకముందు ఈ లిస్ట్‌విడుదల చేసింది. మారిన రాజకీయ పరిస్థితుల్లో బీజేపీతో పొత్తు దాదాపు ఖరారు కావటంతో ఆ పార్టీ పోటీ చేసే స్థానాల సంఖ్య తగ్గే ఛాన్స్ ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### ఆ సీట్లు జనసేనకు ఇస్తే.. నా దారి నాదే..

శేరిలింగంపల్లి, తాండూర్ సీట్లు జనసేనకు ఇవ్వొద్దని, అలా చేస్తే తన దారి తాను చూసుకుంటానంటూ బీజేపీ సీనియర్ లీడర్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్టీ ఢిల్లీ పెద్దలకు పరోక్షంగా హెచ్చరికలు పంపించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని రెండు స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి టికెట్ బీజేపీ తరఫున రవి కుమార్ యాదవ్‌కే ఇవ్వాలని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టత కోసం బీజేపీ కేడర్ ఎంతో శ్రమించిందని ఢిల్లీ పెద్దలకు వివరించినట్లు సమాచారం. తాండూర్, శేరిలింగంపల్లి స్థానాలను గెలిపించుకునేందుకు లీడర్లు, కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేసినట్లు తెలుస్తున్నది. ఈ టైమ్‌లో పొత్తులో భాగంగా ఈ సీట్లను జనసేనకు ఇస్తే.. పార్టీ కేడర్ మనోభావాలు దెబ్బతింటాయని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇన్నేండ్లు పార్టీ కోసం కార్యకర్తలు పడ్డ కష్టం వృథా అవుతుందని చెప్పారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రజలు భరించే స్థితిలో లేరని, బీజేపీ పోటీ చేస్తే కచ్చితంగా గెలుస్తుందని పార్టీ అధినాయకత్వానికి తెలియజేసినట్లు సమాచారం. బీజేపీ కార్యకర్తల మనోభావాలకు వ్యతిరేకంగా ఈ సీట్లను జనసేనకు ఇస్తే.. పార్టీలో తాను కొనసాగలేనని, రాజీనామా చేసి వెళ్లిపోతానని తేల్చి చెప్పినట్లు తెలుస్తున్నది.

**ఇంకా సస్పెన్స్‌పై అభ్యర్థుల్లో నైరాశ్యం**

ఇప్పటికే నామినేషన్లు ప్రారంభం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. నామినేషన్లకు చివరి గడువు ఈ నెల 10 వరకు ఉండగా, అప్పటివరకు వేచి చూసే అవకాశాలు ఉన్నా యి. ఇతర పార్టీల్లోని అసంతృప్తులు, టికెట్ దక్క ని నేతలు బీజేపీలో చేరే అవకాశం ఉండటంతో ఆ దిశగా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థులతో పాటు శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

# తస్మాత్ జాగ్రత్త!



## బీఆర్ఎస్‌లో అసమ్మతిపై గులాబీ బాస్ సీరియస్
## రెండు నెలలైనా ఇంకా సెట్ చేసుకోలేదా?
## ఇన్‌చార్జిలు ఎందుకు ఫెయిల్ అవుతున్నారు?
## తానే స్వయంగా రంగంలోకి దిగిన కేసీఆర్
## అభ్యర్థులకు నేరుగా ఫోన్లు చేసి హెచ్చరిక
## క్యాండిడేట్లకు దడ పుట్టిస్తున్న బాస్ ఫోన్ కాల్స్

> గులాబీ పార్టీలో అసమ్మతి రోజు రోజుకు మరింత పెరుగుతోందా? ఇన్‌చార్జిలను రంగంలోకి దింపినా పరిస్థితి లో మార్పు రావడం లేదా? అసలు ఇన్‌చార్జిల రాకతోనే పరిస్థితి మరింత జఠిలంగా మారిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. దీనిపై ముందే అలర్ట్‌అయిన గులాబీ బాస్ నేరుగా ఆయనే రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అసమ్మతి ఎక్కువగా పెరిగిన నియోజక వర్గాల నేతలకు, అభ్యర్థులకు సీఎం కేసీఆర్ నేరుగా ఫోన్లు చేస్తూ.. 'తస్మాత్ జాగ్రత్త' అంటూ గట్టిగానే హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో బాస్‌ఫోన్‌కాల్ ఎప్పుడొస్తదో ఏమో అంటూ అభ్యర్థులు వణికి పోతున్నారు.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది. నామినేషన్ల పర్వం కూడా ప్రారంభమైంది. ప్రచారం ఊపందుకుంది.. బీఆర్ఎస్ నేతల టికెట్లు రెండు నెలల కిందే ఖరారు కావడంతో ప్రచారంలో దూసుకు పోతున్నారు. గడప గడపకు ప్రచారం చేస్తూ ప్రతిపక్షాల కంటే ఓ అడుగు ముందే ఉన్నారు. అయినా రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల మధ్య అసమ్మతి సెగలు రగులుతున్నాయని తెలుస్తోంది. దీంతో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు, అభ్యర్థులకు పెద్ద సార్‌ఫోన్‌చేసి గట్టిగానే అర్సుకుంటున్నట్లు తెలుస్తోంది.

తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తూనే దిశానిర్దేశం చేస్తున్నారంట కేసీఆర్. ఓ వైపు సుడిగాలి పర్యటనల్లో పాల్గొంటునే మరో వైపు సొంత పార్టీ అభ్యర్థులకు హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారని తెలుస్తోంది. తాజాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రజా ఆశీర్వాద సభల అనంతరం ఆ జిల్లా నేతలకు అభ్యర్థులకు ఫోన్ చేసి పరిస్థితి ఆరా తీయడంతో పాటు ఎక్కడ లోపం ఉంది ఏ గ్రామం ఏ మండలంలో పరిస్థితి ఎలా ఉందో తనే చెప్తుండటంతో అభ్యర్థులు షాక్ అవుతున్నారట. ఇన్‌చార్జి లుగా వచ్చిన నేతలకు కూడా గట్టిగానే క్లాస్ పీకుతున్నారట పెద్దాయన.

అలసత్వం వీడకపోతే మోసపోతామంటూ సుతిమెత్తగా వార్నింగ్ ఇస్తున్నారని తెలుస్తోంది. రెండు నెలలుగా అసమ్మతిని చక్కదిద్దుకోలేక పోయారా? అంటూ క్లాస్ తీసుకున్నారట. మాట్లాడేది రెండు మూడు నిమిషాలే అయినా పెద్దాయన నుంచి వస్తున్న ఆ కాల్ అభ్యర్థుల ను హైరానాకు గురి చేస్తుందట. మరో వైపు హరీశ్‌రావు , కేటీఆర్‌ల నుంచి వస్తున్న ఫోన్లు సైతం అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయంట. నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణుల పనితీరు, ప్రజల నాడి ఎలా ఉందనే దానిపై స్వయంగా సీఎం కేసీఆర్ ఆరా తీయడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రజా ఆశీర్వాద సభల కంటే ముందు, తర్వాత నియోజకవర్గాల వారీగా సీఎం తన దగ్గర ఉన్న సమాచారంతో సమీక్షించడం నేతలను హైరానాకు గురిచేస్తుందంట. కలిసికట్టుగా పని చేయకుంటే కష్టమనే సంకేతం ఆయా నియోజక వర్గాల నేతలకు ఇచ్చినట్టు సమాచారం. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే 7 అసెంబ్లీ సీట్లలో4 నియోజవర్గాల్లో పరిస్థితి మరింత కష్టంగా ఉందని.. అసమ్మతిని ఎందుకు తగ్గించుకోలేక పోతున్నారు.. మీ ఈగోలు ఎందుకు పక్కన పెట్టలేక పోతున్నారంటూ నేతలకు గట్టిగానే వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ప్రతిపక్షాల అసమ్మతిని ఎలా అనుకూలంగా మార్చుకోవాలో.. నిరాశతో ఉన్న పక్క పార్టీల కీలక నేతలను ఎలా తమ వైపు తిప్పుకోవాలో ఎక్కడ ఏనేత ఎలా ఆశతో ఉన్నాడో పూస గుచ్చినట్టు చెప్తుండటంతో షాక్ అవుతున్నారంట అభ్యర్థులు. ఓ వైపు సుడిగాలి ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటునే మరో వైపు అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తున్నారంట కేసీఆర్.

ముందుగా ఆదిలాబాద్ నియోజకవర్గాల ప్రచారశైలి పైనే ఫోకస్‌పెట్టిన సీఎం.. అతి విశ్వాసానికి వెళ్లకూడదని సుతి మెత్తగా హెచ్చరించనట్టు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి క్లిష్టంగా ఉందని.. సెట్ చేసుకోకపోతే కథకంచికే అంటూ గట్టిగానే చెప్పినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఆదిలాబాద్ జిల్లాలో సిట్టింగ్ సీట్లు మార్చిన ఆసిఫాబాద్, బోథ్ , ఖానాపూర్ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు అత్యుత్సాహం అసలుకే ఎసరు తెచ్చేలా ఉందని.. అసమ్మతి ని కట్టడి చేయడంలో ఇన్‌చార్జిలు కూడా విఫలం అవడంతో కీలక శ్రేణుల నుంచి అనుకున్నంత సహకారం అందడం లేదనే విషయం సీఎం దృష్టికి వెళ్లగా.. ఈ విషయంపై అభ్యర్థులకు క్లాస్ తీసుకున్నట్టు తెలుస్తోంది. శ్రేణులకు కూడా హైకమాండ్‌నుంచి ఫోన్లు వస్తుండటంతో బీఆర్ఎస్ అభ్యర్థుల్లో ఆ టెన్షన్ మరింత పెరిగినట్టే తెలుస్తోంది. ఫోన్ మోగడమే ఆలస్యం అమ్మో హైకమాండ్ ఫోనా అంటూ హైరానా పడిపోతున్నారంట.